RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 306 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | ఆదివారం 27 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### మళ్లీ వేగం పుంజుకున్న పర్సనల్ లోన్లు

ఒకప్పుడు అత్యవసర ఖర్చులకు వెంటనే డబ్బు కావాలంటే చాలామంది బంగారాన్ని తాకట్టు పెట్టేవారు. ఇటీవలి కాలంలో బంగారం ధరలు భారీగా పెరగడంతో గోల్డ్ లోన్లకు డిమాండ్ మరింత పెరిగింది. ఇప్పుడు పరిస్థితి మళ్లీ మారుతున్నట్లు కనిపిస్తోంది. పర్సనల్ లోన్లు వేగం పుంజుకుంటున్నాయి. త్వరలో గోల్డ్ లోన్లను దాటి అత్యంత వేగంగా పెరుగుతున్న రుణ విభాగంగా మారొచ్చని యూబీఎస్ గ్లోబల్ రీసెర్చ్ నివేదిక చెబుతోంది.

### పెరిగిన పీఎఫ్ వేతన పరిమితి..

నెల జీతం వస్తుంది.. ఖర్చులు పోతాయి.. మిగిలిన దాంట్లో కొంత పీఎఫ్‌లోకి వెళుతుంది. ఉద్యోగ జీవితంలో పెద్దగా పట్టించుకోని ఈ చిన్న మొత్తం.. రిటైర్మెంట్ సమయానికి పెద్ద మొత్తంగా మారుతుంది. ఇప్పుడు పీఎఫ్ లెక్కల్లో కీలక మార్పు వచ్చింది. వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంతో ఉద్యోగుల నెలవారీ పొదుపు పెరగనుంది. మరి ఈ మార్పుతో మీ జీతం నుంచి ఎంత పీఎఫ్ కట్ అవుతుంది? సంస్థ ఎంత జమ చేస్తుంది? పెన్షన్‌పై ప్రభావం ఏంటి? ఇప్పటివరకు పీఎఫ్ కోసం నెల జీతంలో గరిష్ఠంగా రూ.15 వేలనే పరిగణించేవారు.

## ఖైరతాబాద్‌లో పోటీ చేస్తాం..

## నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు: కవిత

**ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని దింపుతామన్న కవిత**

**రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని విమర్శ**

**తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరం అఫిడవిట్లో క్లియర్ గా ఉందని వెల్లడి**



**హైదరాబాద్,సెప్టెంబర్,26:**ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు.

## యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం


**. లేటెస్ట్ సర్వేలో వెల్లడి..!**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,26:**ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పొలిటికల్ హీట్ మొదలైంది. అధికార బీజేపీ, ప్రతిపక్ష సమాజ్‌వాదీ(ఎస్పీ)లు తమ ప్రచారాన్ని ప్రారంభించాయి. ఉత్తర్ ప్రదేశ్‌లో అధికారంలో ఉన్న పార్టీనే దేశంలో అధికారం చేపడుతుందనే అభిప్రాయం ఉంది. దీంతో దేశవ్యాప్తంగా యూపీ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.ఇదిలా ఉంటే, తాజాగా న్యూస్ లీడర్ లైవ్- మాట్రిజ్ న్యూస్ కమ్యూనికేషన్ నిర్వహించిన సర్వేలో యూపీలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని అంచనా వేసింది. మొత్తం 403 స్థానాలకు గానూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 267 స్థానాలు గెలుచుకుంటుందని, సమాజ్‌వాదీంకాంగ్రెస్ పార్టీల కూటమి 132 స్థానాలకు పరిమితమవుతుందని అంచనా వేసింది. బీఎస్పీ రెండు, ఇతరులు రెండు స్థానాల్లో గెలుస్తారని చెప్పింది. ఉత్తర్ ప్రదేశ్‌లోని 4 రీజియన్లలో బీజేపీ క్లియర్ కట్ మెజారిటీ సాధిస్తుందని చెప్పింది. వెస్ట్రన్ యూపీలో 136 స్థానాలకు గానూ బీజేపీ 93, ఎస్పీ 43 స్థానాలు గెలుచుకుంటాయని చెప్పింది. అవధ్ రీజియన్‌లోని 118 స్థానాలకు గానూ బీజేపీ 77, ఎస్పీ కూటమి 40, బీఎస్పీ 01, బుందేల్‌ఖండ్ ప్రాంతంలోని 19 స్థానాలకు గానూ బీజేపీ 17, ఎస్పీ 2, పూర్వాంచల్‌లో 130 స్థానాలకు గానూ బీజేపీ 130, ఎస్పీ 47, బీఎస్పీ 01, ఇతరులు 02 స్థానాల్లో గెలుస్తుందని అంచనా వేసింది.

### నాగాలాండ్‌లో విషాదం..

## కల్తీ మద్యం సేవించి 19 మంది మృతి



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,26:**నాగాలాండ్‌లో విషాదం చోటుచేసుకుంది. అనుమానాస్పద కల్తీ మద్యం సేవించిన తర్వాత 2 రోజుల వ్యవధిలో 19 మంది మృతి చెందారు. మృతుల్లో మొకోక్‌చుంగ్ జిల్లాకు చెందిన వారు 8 మంది, తుయెన్సాంగ్ జిల్లావాసులు 11 మంది ఉన్నారు. ఈ విషాద ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు పోలీసులు సిట్‌ను ఏర్పాటు చేసింది ఆ రాష్ట్ర ప్రభుత్వం. ఏఎస్పీ బుంగ్‌లాంగ్ చాంగ్ నేతృత్వంలో ఈ బృందం పనిచేయనుంది. అనుమానిత కల్తీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సరఫరా చేశారు? దాని వెనుక అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నరు. ఫోరెన్సిక్ పరీక్షల నివేదిక అనంతరం మరణాలకు గల కారణాలపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ ఘటనతో పోలీసులు ఆ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు 19 మందిని అరెస్ట్ చేసి, సుమారు 3 వేల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత కల్తీ మద్యం సరఫరా మార్గాన్ని అరికట్టే దిశగా అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

## బాలాపూర్ రికార్డు బద్దలు.. దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు!



**హైదరాబాద్,సెప్టెంబర్,26:**భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాల వేళ లడ్డూ వేలం పాటలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం రికార్డును దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ అధిగమించింది. అక్కడ నిర్వహించిన వేలంలో గణేశుడి ప్రధాన లడ్డూ ఏకంగా రూ.51 లక్షలకు అమ్ముడైంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోసుమారు 2.5 కోట్ల మిర్రర్ గ్లాస్‌లతో ప్రత్యేకంగా అలంకరించిన గణేశుడి మండపంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. చివరకు స్థానిక భక్తుడు రాజేష్ రూ.51 లక్షలు వెచ్చించి ప్రధాన లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంలో నమోదైన రూ.39 లక్షల ధరను దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ దాటింది. ఇదే మండపంలో మరో లడ్డూకు కూడా భారీ ధర పలికింది. మరో భక్తుడు రూ.25 లక్షలకు దక్కించుకున్నారు. గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళితే శుభం కలుగుతుందని, వ్యాపారంలో అభివృద్ధి ఉంటుందని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ నమ్మకంతోనే వేలంలో భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన నిధులను సామాజిక, సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని జై గణేశ్ యూత్ అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై ఆరోపణలు..

## 28న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు కాంగ్రెస్ పిలుపు




**హైదరాబాద్,సెప్టెంబర్,26:**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు మొదటి నుంచే అనేక అనుమానాలకు తావిస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తున్నాయని అన్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం సమీపంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తలెత్తుతున్న అనుమానాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘంపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారుదేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసనలు, ఉద్యమాలకు ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## ఉగ్రవాద దేశమే నన్ను ప్రశ్నిస్తోంది

### పాక్ జర్నలిస్ట్‌కు జై శంకర్ ఘాటు జవాబు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,26:**యూఎన్‌జీవో 81వ సమావేశాలలో భాగంగా న్యూయార్క్‌లో జరిగిన మీడియా సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పాకిస్తాన్ జర్నలిస్ట్‌కు దిమ్మదిరిగే సమాధానం ఇచ్చారు. ప్రెస్ బ్రీఫింగ్ ముగిసే సమయంలో ఒక పాక్ జర్నలిస్ట్ లేచి 'పాకిస్తాన్‌లో భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని మీ దేశం ఎప్పుడు ఆపుతుంది' అని ప్రశ్నించారు. దీనికి ఆయన ఏమాత్రం తడబడకుండా, నవ్వుతూ, సూటిగా స్పందిస్తూ.. 'ఒక ఉగ్రవాద దేశమే నన్ను ఈ ప్రశ్న అడుగుతోంది. కమాన్' అని ఘాటు జవాబు ఇచ్చారు. జై శంకర్ సమాధానం తర్వాత అక్కడే ఉన్న యూఎన్‌లో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీష్ కల్పించుకొని.. 'మీకు రావాల్సిన సమాధానం అత్యంత స్పష్టంగా, గట్టిగా లభించింది' అని సదరు జర్నలిస్టుతో అన్నారు. అయితే ఈ ఘటన జరగడానికి ఒక రోజు ముందే, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఐక్యరాజ్యసమితి భవనంలోకి ప్రవేశిస్తున్న సమయంలో ఒక భారతీయ జర్నలిస్ట్ ఆయనను అడ్డుకుని 'ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం మీరు ఎప్పుడు ఆపుతారు?' అని ప్రశ్నించారు. దీనిని ప్రతికారంగానే పాక్ జర్నలిస్ట్ జైశంకర్‌ను ఇరుకున పెట్టాలని చూశాడు, కానీ జై శంకర్ తనదైన శైలితో ఆయనకు కౌంటర్ ఇచ్చారు.

### రైతు బీమా రద్దు చేసి

## పశువుల బీమా?.. కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్,సెప్టెంబర్,26:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'రైతు బీమా' పథకం ప్రీమియం చెల్లింపులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపణలు వస్తున్న వేళ ఇదే సమయంలో శనివారం కరీంనగర్ వేదికగా రాష్ట్రంలోని పాడి గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకల కోసం ప్రభుత్వం పశువుల బీమా పథకాన్ని ప్రారంభించడంపై కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. గత ఎనిమిదేళ్లుగా ఏదేని కారణంతో రైతు మరణిస్తే వారి కుటుంబాలకు ఆపద్బాంధవుగా నిలిచిన రైతు బీమాను పక్కనబెట్టడాన్ని కేటీఆర్ తప్పుపట్టారు. రైతు బీమా రద్దు.. పశువుల బీమా ముద్దు అంటూ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఈ పాలన ప్రజాపాలన కాదని, తుగ్లక్ పాలనను తలపిస్తోందని దుయ్యబట్టారు. ఈ మేరకు నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బర్కత్ పల్లి గ్రామానికి చెందిన రైతు ఒర్సు రాంచందర్ గుండెపోటుతో మరణించగా రైతు బీమా పథకం డబ్బుల కోసం అతడి కుటుంబ సభ్యులు ప్రయత్నించగా ఆగస్టు 14 నుంచి ఈ పథకం నిలిచిపోయిందని ఏఈఓ చెప్పినట్లు ప్రచురితమైన న్యూస్ పేపర్ క్లిప్పింగ్ ను కేటీఆర్ షేర్ చేశారు.

## తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం: కేసీఆర్



**హైదరాబాద్,సెప్టెంబర్,26:**తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు. ఐలమ్మ ఆశయాల సాధనే ధ్యేయంగా తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మహిళా, శిశు సంక్షేమంతో పాటు రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేశామని తెలిపారు. కులవృత్తులకు పునరుజ్జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని, ఆనాడు తాము సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

# సంపాదకీయం

## చావొక్కటే.. అన్నింటికీ పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలి! ఎవరి జీవితం కూడా పూల పాన్పు కాదు. ఈ డైలాగ్‌ని.. మన జీవితంలో ఎప్పుడో ఒకసారి వినే ఉంటాం. ఎక్కడో ఓ చోట చదివే ఉంటాం. లైఫ్ అంటే.. ఎప్పుడూ సుఖంగా, అన్ని రోజులూ సంతోషంగా ఉండదని తెలుసు. కష్టాలు, సుఖాలు, సవాళ్లు, సమస్యలు.. అందరికీ ఉంటాయ్. ఇవన్నీ.. ఏదో ఒక ఫేజ్‌లో ఎదుర్కోక తప్పదు. అయినా సరే.. జీవితంలో ఎదురయ్యే ఎలాంటి కష్టాన్నైనా.. ఎదుర్కోవాలి. వాటన్నింటిని ధైర్యంగా దాటుకొని.. ముందుకు సాగాలి. కానీ.. ఈరోజులు అలా లేవు. కాలం మారేకొద్దీ.. పబ్లిక్ మరింత వీక్‌గా తయారవుతున్నారు. చిన్న చిన్న విషయాలకే.. చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటున్నారు. తనువు చాలిస్తున్నారు. సమస్య వస్తే చాలు.. దాన్ని ఎదుర్కోలేక చచ్చిపోతున్నారు. ఇటీవలి కాలంలో చిన్నా, పెద్ద, యువత, ముసలి, ముతకా అనే తేడా లేదు. అందరిదీ అదే దారి. ఎంతో అందమైన జీవితాన్ని గెలవలేక.. అర్థాంతరంగా చనిపోతున్నారు. అసలు.. ఓ చిన్న సమస్యని కూడా ఎదుర్కొనే ధైర్యం లేకుండా ఎలా ఉంటున్నారు? దేనినైనా తట్టుకోగలిగే, ఎదుర్కోగలిగే ఆత్మవిశ్వాసం ఏమైపోయిందనే ప్రశ్నలే.. ఇప్పుడు అందరిలోనూ తలెత్తుతున్నాయ్. సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో విశాఖలో యువకుడు ఆత్మహత్య సీఏ పరీక్షల్లో ఫెయిల్ అవడంతో.. తల్లిదండ్రులను మోసం చేశాననే మనస్తాపంతో విశాఖలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొబ్బరితోట ఏరియాలో ఓ గదిని అద్దెకు తీసుకొని.. హీలియం గ్యాస్‌తో ముఖానికి కవర్ తగిలించుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు..మళ్లీ పాస్ అయ్యే చాన్స్ ఉంటుంది హైదరాబాద్‌లో రెండేళ్ల కూతురితో తల్లి ఆత్మహత్య హైదరాబాద్‌లో కుటుంబ కలహాలతో.. హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది కీర్తిక అగర్వాల్. తనతో పాటు రెండేళ్ల చిన్నారి ప్రాణాన్ని కూడా తీసుకెళ్లిపోయింది. ఫ్యామిలీలో గొడవలున్నంత మాత్రాన, భర్తతో మనస్పర్థలు వచ్చినంత మాత్రాన.. చావే పరిష్కారమా? అంతగా ఇబ్బంది ఉంటే.. పెద్దవాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటమో, కౌన్సిలింగ్ తీసుకోవడమో చేయాలి గానీ.. ఇలా ప్రాణాలు తీసుకోవడమేంటి? చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఎందుకొస్తోంది? అనేదే.. ఎవ్వరికీ అంతుబట్టడం లేదు. తిరుపతిలో ఇంజనీరింగ్ చదువుతున్న 20 ఏళ్ల చందు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో.. తొర్రేడు తిరుమల కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఎల్ల సత్యదేవకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌లో తండ్రి దించి వెళ్లిన కొన్ని గంటల్లోనే.. సూసైడ్ చేసుకున్నాడు. హాస్టల్‌లో ఉండనని, ఇంటి దగ్గరే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో.. ఆత్మహత్యే శరణ్యం అనుకున్నాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోతే.. వారిని ఒప్పించే ప్రయత్నం చేయాలి. కూర్చోబెట్టి నచ్చజెప్పాలి. ఒకసారి కాకపోయినా.. మరోసారి వింటారు. కానీ.. హాస్టల్లోనే ఉండమన్నారనే బాధతో ప్రాణాలు తీసుకోవడమేంటి? చిత్తూరు జిల్లా సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ సూసైడ్ చిత్తూరు జిల్లాలో సీతమ్స్ కాలేజీలో ఇంజనీరింగ్ స్టూడెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో అంతస్తు నుంచి దూకి చనిపోయాడు. కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిలిస్తున్నారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఉన్నట్లే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుంది. ప్రతి చీకటి వెనుక.. ఓ వెలుగు రేఖ దాగి ఉంటుంది. సమస్య ఎలాంటిదైనా.. పరిష్కారం ఓపిగ్గా ఆలోచించి వెతుక్కోవాల్సింది మనమే. సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని.. జీవితాన్ని గెలవాల్సిందే! కానీ.. దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న ఆత్మహత్యల పరంపర చూస్తుంటే.. సమాజం ఎటు వైపు పోతుందోనన్న భయం కలుగుతోంది. ప్రతి ఒక్కరూ.. చావే పరిష్కారమనే మూర్ఖపు ఆలోచనల నుంచి బయటకు రాకపోవడమే.. గుండెల్ని పిండేస్తోంది. ఇప్పటికే ఉన్న ఆత్మహత్యల ఆందోళనల్ని మరింత పెంచుతోంది. మరి.. దీనికేంటి పరిష్కారం? చాలా మందిలో సన్నగిల్లుతున్న ఆత్మవిశ్వాసం కారణాలు ఏవైనా కావొచ్చు.. సమస్య ఎలాంటిదైనా ఉండొచ్చు.. కానీ.. తీరిగ్గా ఆలోచిస్తే ప్రతి ప్రాబ్లమ్‌కి.. కచ్చితంగా సొల్యూషన్ దొరుకుతుంది. కానీ.. ఏదైనా సమస్య వస్తే.. దాన్ని తట్టుకునేంత ఆత్మవిశ్వాసం చాలా మందిలో సన్నగిల్లుతోంది. వరుస ఆత్మహత్యల్ని చూశాక.. అర్థమవుతున్నది ఇదే. మార్కులు తక్కువొచ్చాయని, ఎగ్జామ్‌లో ఫెయిలయ్యామని, ప్రేమలో విఫలమయ్యామని, ఆర్థికంగా నష్టపోయామని, సోషల్ మీడియాలో ట్రోల్స్, కుటుంబ కలహాలు, వేధింపులు.. ఇలా చెప్పుకుంటూ పోతే.. అనేక కారణాలున్నాయ్. జీవితంలో భాగంగా ఎదురయ్యే చిన్న ఫెయిల్యూర్‌కి కూడా.. జీవితమే అంతమైపోయినట్లు భావిస్తున్నారు. ప్రతి సమస్యకు.. ఇన్‌స్టంట్ రిలీఫ్ కావాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా.. వెంటనే పరిష్కారం దొరికేయాలనుకుంటారు. సొల్యూషన్ కాస్త లేటైనా.. లైఫ్ ఎండింగ్ డెసిషన్ తీసేసుకుంటున్నారు. ఇతరుల జీవితాలతో పోల్చుకుంటూ.. తాము ఎందుకూ పనికిరామని నిరాశ చెందుతున్నారు. మిగతా వాళ్లలా.. తమ లైఫ్ ఎందుకు లేదని బాధపడుతుంటారే తప్ప.. వారి స్థాయికి ఎదగాలని అనుకోవడం లేదు. ఈ సోషల్ కంపారిజన్స్ కూడా.. సూసైడ్స్‌కి ఓ రీజన్‌గా కనిపిస్తోంది. చాలా మంది తమ సమస్యలకు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా.. ఇతరులతో పంచుకోకుండా.. వాళ్లకు వాళ్లే కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంతోమందిపై..వారు పెరిగిన కుటుంబ, సామాజిక వాతావరణం కూడా ప్రభావం చూపుతోంది.పిల్లల మార్కుల కోసం, ర్యాంకుల కోసం పేరెంట్స్ చేసే ప్రెజర్‌ని తట్టుకోలేని వాళ్లు చాలా మంది ఉంటున్నారు. వారు.. తమ తల్లిదండ్రుల ఆశల్ని అందుకోలేకపోయినప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఇక.. కుటుంబంలో ఉండే వాతావరణం కూడా వారి జీవితాలపై ప్రభావం చూపుతోంది. తమ సమస్యలు పంచుకునే వాతావరణం లేకపోవడం, ఒంటరితనం పెరగడం లాంటివి.. తనువు చాలించాలనే నిర్ణయాలకు దారి చూపుతున్నాయ్. ఆత్మహత్య.. ఎప్పటికీ సమస్యకు పరిష్కారం కాదు. పైగా.. అది ఎవరూ పరిష్కరించలేని మరో సమస్యని సృష్టిస్తుంది. తమనే నమ్ముకున్న వారి జీవితాలను ప్రశ్నార్థకం చేస్తుంది. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి బాధ అక్కడితో అంతమవుతుంది. కానీ.. ఆ బాధ మొత్తం కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, శ్రేయోభి లాషులకు వారసత్వంగా మిగులుతుంది. ఇది.. మిగతా వారి జీవితాలపై ప్రభావం చూపుతుంది. జీవితమనేది.. ఆ భగవంతుడు ఇచ్చిన బహుమ తి. జీవితమనేది.. లైఫ్ జర్నీలో ఎదురయ్యే సంఘటనలతో అనుభవాలని నేర్చుకునేందుకు, అప్పుడప్పుడు వచ్చే సమస్యలను అధిగమించేందుకు.. ఓ చక్కని అవకాశం. ప్రతి సమస్య ఓ పాఠాన్ని నేర్పుతుంది. చచ్చేంత ధైర్యం.. బతకడానికి ఎందుకు లేదనే ప్రశ్న కూడా ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తిలో అపారమైన ధైర్యం, కఠినమైన నిర్ణయం తీసుకునే శక్తి ఉంటుంది. అదే ధైర్యాన్ని.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లని ఎదుర్కొనేందుకు, పోరాడేందుకు ఉపయోగిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోతాయ్. జీవితం లో ఎదురయ్యే కష్టాలకు ముగింపు ఆత్మహత్య కాదు.. సమస్యలున్నోళ్లు ఎవరైనా ఆలోచించాల్సింది.. అత్మహత్యలు ఎలా చేసుకోవాలని కాదు.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# పులులతోనే అడవులకు మనుగడ..!



పర్యావరణానికి పులులకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యధేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# ఆక్వాలో ట్రంప్ టారిఫ్‌ల అలజడి

### తాజాగా 500 శాతం ప్రకటనతో రైతులు బెంబేలు

### ఓ వైపు వ్యాధులు, మరోవైపు ఎగుమతుల్లో ఒడిదుడుకులు



రాజమహేంద్రవరం : అమెరికా విధించిన టారిఫ్‌లతో మన రొయ్య ఎదురీదుతోంది. ఓ వైపు వాతావరణ మార్పులతో వ్యాధుల కారణంగా ఎదుగుదల లోపం, మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో రొయ్యల సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. విదేశీ ఎగుమతులపైనే గోదావరి జిల్లాలో ఆక్వా సాగు జరుగుతోంది. 500 శాతం సుంకాలు పెంచుతామంటూ ట్రంప్ చేసిన తాజా ప్రకటించారు. అమెరికాలో ఈ బిల్లు ఈ నెల 15న సనెట్‌కు వెళ్లే అవకాశం ఉంది. దీంతో, ఆక్వా రైతులు, వ్యాపారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 77,150 ఎకరాల్లో ఆక్వా సాగవు తోంది. గతంలో 85 వేల ఎకరాల్లో ఆక్వా సాగు ఉండేది. గతేడాది నుంచి ట్రంపు సుంకాల నేపథ్యంలో చాలా మంది రైతులు ఆక్వా నుంచి తప్పుకున్నారు. ఇక్కడ 30 నుంచి 100 కౌంట్ వరకూ రొయ్య లను సాగుచేస్తున్నారు. 30 నుంచి 40 కౌంట్ సాగు ఎక్కువగా ఉంది. ఇదంతా అమెరికా ఎగుమతులను దృష్టిలో పెట్టుకునే సాగు చేస్తున్నారు. ఈ కౌంట్‌లో 60 శాతం రొయ్యలు అమెరికాకే ఎగుమతి అవుతున్నాయి. గతంలో ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల నేపథ్యంలో ఆక్వా పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. కనీసం ధర లేకరైతులు ఇబ్బందులు పడ్డారు. దీంతోచాలామంది ఆక్వా రైతులు స్థానికంగానే వీటిని అమ్ముకోవాల్సి వచ్చింది. గిట్టుబాటు కాకున్నా పంటను వచ్చిన కాడికి రైతులు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం రైతుల నుంచి 30 కౌంట్ రొయ్యలు కేజీ రూ.400కు, వంద కౌంట్ కేజీ రూ.240కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. 50 శాతం సుంకాల తర్వాత ఇప్పుడిప్పుడే ఆక్వా రైతు కోలుకుంటు న్నారు. ఈ సమయంలో 500 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో ఎగుమతిదారులు, రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. జనవరి 15 తర్వాత అక్కడి దిగుమతిదారులు పెట్టే కొత్త ఆర్డర్లపైనే మన రొయ్యల మార్కెట్ ఆధారపడి ఉంటుంది. దీంతో, అమెరికాలో దిగు మతి చేసుకునే వ్యాపారులు ఏ నిర్ణయం తీసుకుంటారో అనేదానిపై ఎగుమతిదారులు ఉత్కంఠగా ఉన్నారు. అక్కడ డిమాండ్‌ను బట్టి ఆర్డర్లు ఉంటాయి. ఇప్పటికే అమెరికా వ్యాపారులు టారిఫ్‌పై అక్కడి న్యాయస్థానాలను ఆశ్రయించారు. వాటి తీర్పుపై భవిష్యత్తు టారిఫ్ ఆధారపడి ఉంటుంది. అమెరికాకు ఎగుమతులు మందగిస్తే యూరప్, జపాన్, చైనా తదితర దేశాలపై ఇక్కడి ఆక్వా రైతులు ఆధారపడాల్సి వస్తుంది. ఇప్పటికిప్పుడు అంత విదేశీ మార్కెట్‌ను పెంచుకునే అవకాశం లేకపోవడంతో వారంతా ఆందోళనతో ఉన్నారు. అమెరికా లో మాత్రమే 30 నుంచి 40 కౌంట్ రొయ్యలను వినియోగిస్తారు. చైనా, జపాన్ దేశాల్లో వంద కౌంట్ వినియోగం ఎక్కువ. అయితే వంద కౌంటు రొయ్యలను ప్రోసెసింగ్ చేయాలంటే వ్యయప్రయాసల ను భరించాలి. అదే ఇప్పుడు ఎగుమతిదారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గతేడాది నుంచి వచ్చిన ట్రంప్ టారిఫ్ విధానంతో ఇక్కడ రైతులు ఉత్పత్తి తగ్గించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా ఆరు లక్షల టన్నుల రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు.

వెంటాడుతున్న వ్యాధులు: కొన్నేళ్లుగా వరస తుపాన్ల నేపథ్యంలో చెరువుల్లో నీరు మారి 'ఎంటిరో సైటోజూన్ హిపటోపీనై (ఇహెచ్‌పి) అనే వ్యాధి సోకింది. దీంతో, రొయ్యల్లో ఎదుగుదల లోపం తలెత్తింది. సాధారణంగా జిల్లాలో జులై వరకు మొదటి పంట, ఆగస్టు నుంచి రెండో పంట వేస్తారు. తొలి పంటను పరీక్షించకుండానే రెండో పంటను రైతులు సాగు చేశారు. నేషనల్ సర్వే లైన్స్ ప్రోగ్రాం ఆన్ ఆక్వాటిక్ యానిమల్ డిసీజ్ (నాస్‌పాడ్) భాగంగా మత్స్యశాఖ పరీక్షలు చేయగా, 96 ఇహెచ్‌పి పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

# కాలుష్య కట్టడి ఎలా...

ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం . నిబంధనల అమలు లో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు.ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము.కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమి బాంబే, ఔఇఇఖీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు.

## చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

# ఘనంగా జయంతి ఉత్సవాలు

నిజామాబాద్ సిటీ, సెప్టెంబర్ 26( ప్రజాగళం ) తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు అంకిత భావంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సీ, అదనపు కలెక్టర్, ఇతర జిల్లా శాఖల అధికారులు, వివిద కుల సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ జయంతి సభ జరిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారని గుర్తు చేశారు. హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసి స్ఫూర్తిని నింపారని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆశయాల సాధనకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి. శాఖ అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# జెండా బాలాజీ ఆలయంలో మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు

నిజామాబాద్ సెప్టెంబర్ 26 ( ప్రజా గళం ప్రతినిధి) జెండా బాలాజీ ఆలయంలో జెండా జాతరను పురస్కరించుకొని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామిని కోరడం జరిగిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, దేవుని కృప ఎల్లవేళలా ఉండాలని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రామ్ భూపాల్, జీవి రామకృష్ణ, బాలాజీ ఆలయ కమిటీ చైర్మన్ లవంగ ప్రమోద్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షునిగా ఎడ్ల బాలకృష్ణ



నిజామాబాద్, సెప్టెంబర్ 26, ప్రజాగళం:
నిజామాబాద్ బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షునిగా ఎడ్ల బాలకృష్ణ నియమితులయ్యారు. నగరంలోని శివాజినగర్ కు చెందిన ఎడ్ల బాలకృష్ణ మొన్నటి వరకు నిజామాబాద్ అర్బన్ ఎస్సీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ గా పని చేశారు. గతంలో నిజామాబాద్ బీజేపీ పట్టణ కార్యదర్శిగా రెండుసార్లు పని చేశారు. నిజామాబాద్ నగరంలోని ఖిల్లా మండలం కార్యదర్శిగానూ పని చేశారు. తనను ఉపాధ్యక్షునిగా నియామకానికి కృషి చేసిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు
అర్వింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోతుల పురుషోత్తంకు ధన్యవాదాలు తెలిపారు.

**. . .బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గం నియామకం**

నిజామాబాద్ జిల్లా దళిత మోర్చా కార్యవర్గాన్ని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు పోతుల పురుషోత్తం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు దినేష్ కులాచారి ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధికి చెందిన ఎస్సీ మోర్చా నాయకులకు జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పోగుల సాయికృష్ణ, మురళికృష్ణ, బొల్లం అరుణ్, దాయ ప్రవీణ్, ఎడ్ల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా గుంజాల నాగభూషణ్, పులి యుగంధర్, కార్యదర్శులుగా బుద్ద సృజన్, గొల్లపల్లి శ్రీనివాస్, అఖిలేష్ కుమార్, రాహుల్, గజ్జల శంకర్ ను నియమించారు. కోశాధికారిగా పవార్ సాయినాథ్, కార్యవర్గ సభ్యులుగా సిరికెల సతీష్, బి.సంతోష్, పల్లె మధుకర్, మల్లెపూల రాజు, సందిటి సాయిలు, అంగరి రాజలింగం, గైని శ్రీనివాస్, బాబురావు, అవినాష్, మిర్యాల శంకర్, బేగరి వినోద్, మహేంధర్ లను నియమించారు. సంబంధిత నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని జిల్లా అధ్యక్షులు పురుషోత్తం తెలిపారు.



# టాప్ గేర్ లో రియల్ ఎస్టేట్

హైదరాబాద్: దేశంలోని 8 ప్రధాన నగరాల్లో చూస్తే హౌసింగ్ సేల్స్ (ఇళ్లు లేదా ఫ్లాట్ల విక్రయాలు) గతేడాది 3.48 లక్షల యూనిట్లుగా ఉన్నాయి. ఇది అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే స్వల్పంగా ఒక శాతం తగ్గిందని చెప్పొచ్చు. అయితే ఇదే సమయంలో ఈ ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు సగటున 19 శాతం వరకు పెరిగినట్లు పేర్కొంది. బుధవారం రోజు వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్‌ఫ్రాంక్ ఇండియా ఈ డేటా విడుదల చేసింది. ఇక్కడ ప్రధానంగా హోం లోన్ వడ్డీ రేట్లు తగ్గడం సహా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండటం, ద్రవ్యోల్బణం తగ్గుతుండటం వంటివి హౌసింగ్ డిమాండ్‌ను స్థిరంగా ఉంచేందుకు దోహదం చేసినట్లు తెలిపింది. ఈ 8 ప్రధాన నగరాలు చూస్తే ఢిల్లీ- ఔఅఖీ, ముంబై, బెంగళూరు, పుణె, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతా ఉన్నాయి.ఇక్కడ ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే సేల్స్ కాస్త ఎక్కువగా పెరిగాయి. ఇక్కడ 2025 సంవత్సరంలో మొత్తం ఇళ్ల విక్రయాలు 4 శాతం పెరిగి 38,403 యూనిట్లకు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇళ్లు లేదా ఫ్లాట్స్ ధరలు కూడా 13 శాతం వరకు పెరిగి చదరపు అడుగుకు సగటు ధర రూ. 6,721 గా ఉంది. రెండో అర్ధభాగంలో అంటే జులై- డిసెంబర్ సమయంలో హౌసింగ్ సేల్స్ హైదరాబాద్ నగరంలో 19,355 గా ఉండగా.. ఇది అంతకు ముందు సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే 5 శాతం ఎక్కువ.కొత్త ఇళ్ల సప్లై విషయానికి వస్తే 2025లో హైదరాబాద్‌లో ఇది 40,737 యూనిట్లుగా ఉండగా.. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం తగ్గింది. ఇక 2025లో అన్‌సోల్డ్ ఇన్వెంటరీ అంటే అమ్ముడు పోని ఇళ్లు లేదా ఫ్లాట్ల సంఖ్య హైదరాబాద్‌లోనే 54,878 యూనిట్లుగా ఉండటం గమనార్హం. అంటే ఇక్కడ డిమాండ్‌కు మించి కొత్త ఇళ్ల సప్లైఉండటమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. హైదరాబాద్‌లో ప్రధా నంగామౌలిక వసతుల కల్పన, ఉద్యోగాల సృష్టిలో దూసుకెళ్తుండటం వల్ల రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతు న్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్ తెలిపింది.ముంబైలో హౌసింగ్ సేల్స్ ఒక శాతం పెరిగి 97,188 యూనిట్లుగా ఉంది. ఇక్కడ సగటున ఇళ్ల ధరలు 7 శాతం పెరిగి చదరపు అడుగుకు రూ. 8,856గాఉంది. బెంగళూరులో ఇళ్ల విక్రయాలు స్థిరంగా 55,373 యూనిట్లుగా ఉంది. ఇళ్ల ధరలు సగటున 12 శాతంవరకు పెరిగి చ.అడుగుకు రూ. 7,388గా ఉంది. పుణె, ఢిల్లీ, కోల్‌కతాలోనూ ఇళ్ల అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టాయి.

# కేంద్ర ఎన్నికల కమిషన్ ఏకపక్ష ధోరణిపై ఈనెల 28న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి.- ట్యాంక్ బండ్ వద్ద ఆందోళనకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి.- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్.

నిజామాబాద్ సెప్టెంబర్ 26 ( ప్రజా గళం ప్రతినిధి ) ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.. ఎన్నికల సంఘం ప్రవర్తిస్తున్న తీరుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ తో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ అంబెడ్కర్ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10.30 గంటలకు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.. ఈ విషయాలపై ఆయన ఒక ప్రకటన చేస్తూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడికి హక్కు అని పౌరుల హక్కులను కాపాడడం ఎన్నికల సంఘం కనీస బాధ్యత అని స్పష్టం చేశారు. గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై చీఫ్ ఎన్నికల కమిషనర్ ను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి లు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలు వెలుగులోకి వచ్చాయని వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం-6లో సర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బయటకు వచ్చిందని, ఈ ప్రక్రియలో తలెత్తిన అనుమానాలు, ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయన కోరారు. ఫారం-6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారుల పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని, ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అత్యంత బాధ్యత యుతంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. సర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో



ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని, పేర్ల తొలగింపునకు కారణాలు ఏమిటి, ఎంత మంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబు దారీతనంతో ఉండేలా చూడాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పకడ్బందీగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి ఎన్నికల సంఘం చర్యలను అనుమాని స్తున్నదని ఇప్పుడు ఇద్దరు కమిషనర్లు కూడా అవే అనుమానాలు వ్యక్తం చేయడంతో దేశంలో ఈ.సి కొంత కాలంగా చేసిన చర్యలు కేంద్రంలోని అధికార పార్టీకి లాభం చేకూర్చిందన్న అనుమానాలు మరింత బలపడ్డాయని అన్నారు. ఈ అంశాలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన, ఉద్యమాలకు ప్రజాస్వామ్య వాదులు, సంఘాలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.

## అంబం(వై)లో రూ:37 వేలకు లడ్డు దక్కించుకున్న గోప రి మహేష్

### రూ: 15 వేలకు మాణిహారం దక్కించుకున్న సున్నం గిరీష్ .

### ..చిన్న గ్రామంలో లడ్డు,మాణిహారం వే లం....బ్రేక్ చేసిన భక్తులు...


ఎడపల్లి,సెప్టెంబర్ 25: (ప్రజా గళం)నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం అంబం(వై) గ్రా మంలో భక్తి శ్రద్ధలతో 11 రోజుల పాటు ప్రత్యేక పూజ లు అందుకున్న బొజ్జ గణపయ్య లడ్డు వేలం వేలం పాట రికార్డ్ కొట్టింది.గతంలో ఎప్పుడు కూడా వేలం పాటలో లడ్డు ధర ఇంత పెద్దమొత్తంలో పలుకలేదని గ్రామస్తులు తెలిపారు.గ్రామంలో శుక్రవారం రాత్రి శ్రీ శివపుత్ర గణేష్ మండలి వారు నిర్వహించిన లడ్డు వేలం పాటలో పోటీ ఏర్పడింది.ఈ వేలం పాటలో గోపరి మహేష్ 37000 రూపాయలకు గణనాథుడి లడ్డు దక్కించుకొని రికార్డ్ బ్రేక్ చేశాడు.ఈ సందర్భంగా గణపతి లడ్డును శివపుత్ర గణేష్ మండలి నిర్వాహ కులు భక్తుడు గోపరి మహేష్ కు అందజేశారు.అనంత రం శివపుత్ర గణేష్ మండలి గణపతి మేడలోని మణి హారం(పైసలు)దండకు వేలం నిర్వహించారు.15000 రూపాయల మణిహారం(పైసల దండ)ను సున్నం గిరీష్ దక్కించుకున్నాడు.పోటాపోటిగా జరిగిన వేలం పాట లో గిరీష్ స్వామివారి మణిహారం(పైసల దండ)ను దక్కించుకొని గణపయ్య కృపాకు పాత్రులయ్యారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,గ్రామస్తులు,గణేష్ మండ లి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







# హైవేల నిర్మాణంలో 2 గిన్నిస్ రికార్డులు



కర్నూలు: ఏపీలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి రెండు గిన్నిస్ వరడల్డ్ రికార్డులు నమోదయ్యాయి. ఈ విషయాన్ని ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. భారత జాతీయ రహదారుల సంస్థ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన ఘనతను సాధించింది.బెంగళూరు- కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో భాగంగా, కేవలం 24 గంటల వ్యవధిలో నిరంతరాయంగా 28.95 లేన్-కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించి, 10,675 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీటును వేయడం ద్వారా రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ప్రపంచస్థాయి రహదారి మౌలిక సదుపాయాలను నిర్మించాలనే భారత ప్రభుత్వ సంకల్పానికి మరియు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గదర్శకత్వానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది.ఈ అసాధారణ విజయం ఇంజనీర్లు, కార్మికులు మరియు ఫీల్డ్ టీమ్‌ల అంకితభావంతో సాధ్యమైందని చంద్రబాబు అన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ నిర్దేశించిన అత్యంత కఠినమైన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూనే ఈ రికార్డును నెలకొల్పడం విశేషం. ఇదే ఉత్సాహంతో జనవరి 11, 2026 నాటికి ఈ ప్రతిష్ఠాత్మక కారిడార్‌లోని ప్యాకేజీ 2, 3లలో మరో రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించేందుకు బృందం సిద్ధమవుతోంది. భారతదేశం నిర్మిస్తోంది.. ఆంధ్రప్రదేశ్ అందిస్తోంది అనే నినాదానికి ఈ ప్రాజెక్ట్ ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఆర్థిక కారిడార్ బెంగళూరు, విజయవాడ మధ్య ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించనుంది. ఇది రాయలసీమ మరియు కోస్తా ఆంధ్ర ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కీలకం కానుంది. గతంలో మహారాష్ట్రలోని అమరావతి- అకోలామధ్య75 కిలోమీటర్ల సింగిల్ లేన్ రహదారిని 105 గంటల్లో నిర్మించి ఎన్‌హెచ్‌ఏఐ రికార్డు సృష్టించింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 24 గంటల్లోనే ఇంత భారీ స్థాయిలో కాంక్రీట్ వేయడం మరో మైలురాయి. ఇటువంటి భారీ పనుల కోసం పేవర్ మెషీన్స్, అత్యాధునిక 'బిటుమిన్ మిక్సింగ్ ప్లాంట్లను' ఉపయోగిస్తారు, ఇవి గంటకు వందల టన్నుల మెటీరియల్‌ను ప్రాసెస్ చేయగలవు.

## గణపతి బొప్పా మోరియా..జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ
## భక్తుల నినాదాల మధ్య గణనాథులను గంగమ్మ ఒడికి సాగనంపారు
### భక్తితో ఘనంగా నిమజ్జ నం...ఎడపల్లి మండలంలో వైభవంగా సాగిన గణ నా థుల నిమజ్జన శోభాయాత్ర....

ఎడపల్లి,సెప్టెంబర్ 26: (ప్రజా గళం)ఎడపల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శుక్రవారం గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సంద ర్భంగా గణనాథుల నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధ లతో కన్నుల పండువగా,వైభవంగా నిర్వహించారు. ఎడపల్లి గ్రామంలోని సార్వజనిక్ గణేష్ మండపం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ప్రధాన వీధుల మీదు గా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.బాజా భజంత్రీలు,కోలాటాలు,జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ భక్తుల నినాదాల మధ్య శోభాయాత్ర సాగింది. "గణపతి బప్పా మోరియా"అంటూ భక్తులు చేసిన నినాదాలతో వీధులు మార్మోగాయి.మహిళలు,చిన్నా రులు,యువకులతో పాటు పిల్లలు పెద్దలు అన్న తేడా లేకుండా నృత్యాలు చేస్తూ సాగిన శోభాయాత్ర.ఈ శోభాయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనా థుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు వినాయక మండపాల నిర్వాహకులు గణేష్ విగ్ర హాలను ప్రత్యేకంగా అలంకరించి శోభాయాత్రలో తర లించారు.శనివారం తెల్లవారు జామున శోభాయాత్ర ఎడపల్లి పులి చెరువు వద్దకు చేరుకుంది.అక్కడ ఏర్పా టు చేసిన నిమజ్జన ప్రాంతంలో గణేశ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.బోయి కులస్తులు గజ ఈ తగాళ్లు గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు.నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు,పోలీసులు,ఉ త్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు.శోభా యాత్ర మార్గంలో భక్తులకు ఇబ్బందులు కలగ కుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు.శనివారం ఉదయం స్థానిక పులి చెరువులో గణనాథులను



భక్తి శ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం చేశారు.పోపో గణపయ్య మళ్ళొచ్చే ఏడాదికి మా ఇంటికి రావయ్య అంటూ గణ నాథుడిని భక్తులు వేడుకున్నారు.పలు గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొని సమీప చెరువులో గణేష్ విగ్రహాలను భక్తి నిమజ్జనం చేశారు.ఈ నిమజ్జణోత్సవ శోభాయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు.

## 13 వార్డులో గాంధీ బొమ్మకు వెళ్లే దారిలో
## మొరం వే యించి మరమ్మాత్తు పనులు...మున్సిపల్ చైర్ పర్సన్

బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 26: (ప్రజా గళం)బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి,పట్టణంలోని 13వ వార్డులోగల గాంధీ బొమ్మకు వెళ్లే దారిలో మొరం వేయించి మరమ్మాత్తు పనులు చేపట్టారు.గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు ఇబ్బందిక రంగా ఉండడం మూలంగా రోడ్డును మరమ్మతులు, మొరం వేయించడం జరిగింది అని చైర్ పర్సన్ తూము పద్మ తెలిపారు.ప్రజలకు సరైన దారి లేక అసౌకర్యవం తంగా ఉండటంతో రోడ్డుకు మొరం పోయించి మర మ్మాత్తు పనులు చేపట్టడం జరిగింది అని ఆమె తెలిపా రు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ,వార్డు కౌన్సిలర్ లంక రవి,కాంగ్రెస్ నాయకులు రవీందర్ గౌడ్, కిషోర్ పర్యవేక్షించారు.



## ఘనంగా బాలాజీ జెండా జాతర
## జెండా జాతర ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 26 (ప్రజాగళం ) జిల్లా కేంద్రంలోని జెండా గల్లీలో గల బాలాజీ మందిరంలో శనివారం ఘనంగా జెండా జాతర నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. అత్యంత భక్తి శ్రద్ధలతో జెండా బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టింది.నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో శనివారం నిర్వహించిన జెండా జాతరలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇందూరులో ఏళ్లుగా జెండా జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భాద్రపద మాసంలో వినాయకచవితికి ముందు జెండా జాతర ప్రారంభం అవుతుందన్నారు. జెండా ఆలయం నుంచి శోభాయాత్రగా పులాంగ్ వరకు కొనసాగి, అక్కడ వారం రోజులపాటు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ దర్శించుకొని వేంకటేశ్వర స్వామి కృపా కటక్షాలు పొందాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, పసునూరి రాము, మల్కాయి మహేందర్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత
### కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్, సెప్టెంబర్ 26 ( ప్రజాగళం ప్రతినిధి ) గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కందకుర్తి, యంచ వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన కోసం పనులను ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పుష్కరాలకు గడువు సమీపిస్తున్నందున పనులను తక్షణమే చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రంతో పాటు బాసరకు ఆనుకుని అత్యంత చేరువలో ఉన్న యంచ వద్ద వద్ద ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు వీలుగా శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు. ఎస్సారెస్పీ లో ప్రస్తుతం 46 టీ.ఎం.సీల వరకు నీరు నిలువ ఉందని, 20 నుండి 25 టీ.ఎం.సీలకు నీటి మట్టం చేరిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. మిగితా పనులను వెంటదివెంట చేపట్టి, మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు. కందకుర్తి, యంచతో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టేలా అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




## జై బోలో గణేష్ మహారాజ్ కి జై...గణపతి బొప్పా మోరి యా అంటూ
## భక్తుల నినాదాల మధ్య గణనాథుడిని గంగమ్మ ఒడికి సాగనంపు...
### పసుపువాగులో భక్తితో ఘనంగా నిమజ్జనం... బోధన్‌లో వైభవంగా సాగిన గణ నాథుల నిమజ్జన శోభాయాత్ర....

బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 26: (ప్రజా గళం)బోధన్ పట్టణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం గణనాథుల నిమజ్జన శోభాయా త్రను భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా,వైభవంగా నిర్వ హించారు. పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ప్రధాన వీధుల మీదుగా ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.బాజా భజంత్రీలు,కోలాటాలు,జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ భక్తుల నినాదాల మధ్య శోభాయాత్ర సాగింది. "గణపతి బప్పా మోరియా"అంటూ భక్తులు చేసిన నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి.మహిళలు, చిన్నారులు,యువకులతో పాటు పిల్లలు పెద్దలు అన్న తేడా లేకుండా నృత్యాలు చేస్తూ సాగిన శోభాయాత్ర. ఈ శోభాయాత్రలో పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొ ని గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు.పలు వినాయక మండపాల నిర్వాహకులు గణేశ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శోభాయా త్రలో తరలించారు.అనంతరం శనివారం తెల్లవారు జామున శోభాయాత్ర రుద్రూర్ రోడ్డులోని పసుపువాగు వద్దకు చేరుకుంది.అక్కడ ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతంలో గణేశ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు.నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు,పోలీసులు,మున్సిపల్ సిబ్బంది,ఉ త్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టారు.శోభాయాత్ర మార్గంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసు కున్నారు.ఈ కార్యక్రమంలో బోధన్ ఆర్డీవో విజయ కుమారి,తహసీల్దార్ విఠల్,ఏసీపీ శ్రీనివాస్,మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ,ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి,వీడీసీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారి,మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ,పట్టణ సీఐ వెంకట నారాయణ, విద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ,చక్రేశ్వర శివాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మణ్ రావు పటేల్,మారు తీ మందిరం చైర్మన్ గుండేడి శంకర్,కాంగ్రెస్ పట్టణ



అధ్యక్షుడు,కౌన్సిలర్ దాము,బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షు డు రవీందర్ యాదవ్,బీజేపీ బోధన్ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి మోహన్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు పసులో టి గోపి కిషన్,సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూజారి లింగం,గుమ్ముల అశోక్ రెడ్డి,బీర్కూర్ బుజ్జి, బాలరాజ్,రుద్ర సత్యనారాయణ, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, శివాలయం కమిటీ సభ్యులు,మారుతీ మందిరం కమిటీ సభ్యులు,ఉత్సవ కమిటీ ప్రతినిధు లు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో బోధన్ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉ త్సవ కమిటీ సభ్యులు,స్థానికులు,అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో నిమజ్జన కార్య క్రమం ప్రశాంతంగా ముగిసింది.

## నేడు బోధన్ నుంచి కిసాన్ మోర్చా సైకిల్ యాత్ర....
### రై తులు,పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజ యవంతం చేయాలి....బిజెపి బోధన్ నియోజకవర్గ ఇంచార్జి వడ్డీ మోహన్‌రెడ్డి పిలుపు....


బోధన్ ప్రతినిధి,సెప్టెంబర్ 26: (ప్రజా గళం) కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్లేందుకు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నిజామాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బోధన్ నుంచి జగిత్యాల వరకు సైకిల్ యాత్ర నిర్వహించనున్న ట్లు బీజేపీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డీ మోహన్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా శనివారం బోధన్ పట్టణంలోని ఎంపీఆర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.సమావేశంలో వడ్డీ మోహన్‌రెడ్డి మాట్లా డుతూ..సైకిల్ యాత్రను సెప్టెంబర్ 27 ఆదివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారం భించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి నిజామాబా ద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్,బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి,ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోధన్ నియోజకవర్గంలోని రైతులు, బీజేపీ నాయకులు,కార్యకర్తలు,కిసాన్ మోర్చా నాయ కులు,పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని



వడ్డీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బోధన్ బిజెపి అధ్య క్షుడు పసుపులేటి గోపి కిషన్,సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్,వివిధ మండలాల పార్టీ అధ్యక్షు లు కోల ఇంద్రకరణ్,సిర్ప సుదర్శన్,కందికట్ల శ్రీనివాస్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సూరకిరణ్,పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీకి వినతి

నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 26( ప్రజా గళం) ఎమ్మార్పీఎస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జిల్లా అధ్యక్షులు మల్ల మరి సుధాకర్ మహేష్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్ల మరి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి ఎమ్మెల్సీ కోటా కింద భువన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగింది. దీనికి సానుకూలంగా స్పందించిన మహేష్ కుమార్ గౌడ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు సుధాకర్ తెలిపారు. నగర శివారులోని నాగారం ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ భవన నిర్మాణానికి గతంలో స్థలం కేటాయించారని, కానీ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విన్నవించినట్లు తెలిపారు. మహేష్



కుమార్ గౌడ్ ను కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు లత, వసంత, దేవేందర్, శంకర్ ఇతర నాయకులు ఉన్నారు.

## ఈనెల 30 లోపు డబుల్ బెడ్ రూమ్
## ఇళ్ళ కేటాయింపులు పూర్తి చేయాలి
### కలెక్టర్ భవేష్ మిశ్రా

నిజామాబాద్, సెప్టెంబర్ 26 ( ప్రజాగళం ప్రతినిధి ) రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. నిజామాబాద్ నగరం సహా ఆర్మూర్, బోధన్, రుద్రూర్, మోర్తాడ్, బాల్కొండలలో అర్హులైన లబ్ధిబారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన చోట లబ్దిదారులకు కేటాయింపులు జరుపుతున్నామని, ఇదే తరహాలో మిగతా చోట్ల కూడా ఈ నెలాఖరు లోగా కేటాయింపులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన లబ్దిదారుల జాబితాను సమగ్ర పరిశీలన జరపాలని, ఆ జాబితా ఆధారంగా డ్రా పద్ధతిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలన్నారు. జాబితాలో అనర్హులు ఉంటే వారి పేర్లను తొలగిస్తూ, అనర్హతకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు



తదితర కేటగిరీల వారీగా నిర్దేశించిన రిజర్వేషన్ల మేరకు రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు. ఎలాంటి తప్పిదాలు, అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు జరపాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, హౌసింగ్ ఇంచార్జి పీ.డీ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, హౌసింగ్ ఏ.ఈ నివర్తి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com